క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సాలూరు: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పట్టణ అగ్నిమాపకశాఖ అధికారి పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే వసతి గృహంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు ఏ విధంగా సంభవించే అవకాశం ఉంది.. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పెంటయ్య, అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్.వెంకంపేటలో బోరు మరమ్మతులు



ఆర్.వెంకంపేటలో బోరు పైప్‌లు మార్చుతున్న మెకానిక్‌లు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు క్రాస్ ప్రోగ్రాం అమలులో భాగంగా సోమవారం ఆర్.వెంకంపేటలో బోర్ల మరమ్మతులు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి ప్రారంభమైన క్రాస్ ప్రోగ్రాం ద్వారా ఇప్పటి వరకూ 100 బోర్లు మరమ్మతులు నిర్వహించినట్లు చెప్పారు. బోర్ల మరమ్మతులు చేపట్టడానికి అవసరమైన ముడిసరుకు రెండు రోజుల్లో రానుందన్నారు. ముడి సరుకు వచ్చేలోగా గ్రామాల్లో మైనర్ రిపేర్లు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్ వెంకంపేట సర్పంచ్ పెంట శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.శ్రీనివాసరావు, మెకానిక్ సత్యనారాయణ, సిబ్బంది రామకృష్ణ, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సక్రమంగా నిర్వహించాలి



గురుకుల జూనియర్ కళాశాల లైబ్రరీని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

సీతంపేట: పాఠశాల, కళాశాలల్లో గ్రంథాలయాలు సక్రమంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర నూరుల్ కమర్ అన్నారు. స్థానిక గిరిజన గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలను సోమవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించి లైబ్రరీలను తనిఖీ చేశారు. అకడమిక్ పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయినందున విద్యార్థులకు ప్రస్తుతం ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నామని, అందుకు అవసరమైన పుస్తకాలు లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ పి.సూర్యకుమారి అన్నారు. అంతకుముందు దిబ్బగూడలో పసుపు ప్రోసెసింగ్ యూనిట్‌ను సందర్శించి అక్కడ పనిచేస్తున్న మహిళలతో కాసేపు ముచ్చటించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి, ఇతర సిబ్బంది ఉన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు

కొమరాడ: ప్రస్తుతం ఎండలు, వడగాలులు అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని పరుశురాంపురం, చంద్రపీట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను సోమవారం ఆయన పరిశీలించారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వేతనదారులకు వివరించారు. వేసవికాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల శరీరంలో నీటి శాతం పడిపోతుంది. దీనివల్ల పలు రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కాబట్టి ప్రజలు జాగ్రతలు పాటించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచుకోవాలని, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైతే చర్మం పొడిబారడం, తలనొప్పి, వికారం, స్పృహ కోల్పోవడం జరుగుతుందని, అలాంటప్పుడు ఆ వ్యక్తిని వెంటనే నీడలోకి తరలించి గాలి బాగా తగిలేలా చూడాలన్నారు. స్పృహ ఉన్నప్పుడు మాత్రమే నీరు, ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని సూచించారు. తీవ్రతను బట్టి వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇళ్లలోనే ఉండాలని, ఒకవేల బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, వాటర్‌బాటిల్ వెంట తీసుకుని వెళ్లాలని సూచించారు. ఆయన వెంట పీహెచ్‌ఏ విజయగౌరి, క్షేత్ర సహాయకుడు కనకరాజు ఉన్నారు.

జగనన్న పాలనలో రాష్ట్రాభివృద్ధి



పార్వతీపురం టౌన్: ఇంటింటికీ జగనన్న పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, ఎంపీ గొట్టేటి మాధవి



పార్వతీపురం టౌన్: గోడకు స్టిక్కర్ అంటిస్తున్న ఎంపీ గొట్టేటి మాధవి



బలిజిపేట: మిర్తివలసలో ఇంటింటా తిరుగుతున్న కన్వీనర్లు, గృహసారథులు

పార్వతీపురంటౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవితో కలిసి జగనన్నే మా భవిష్యత్తు -మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి 12వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకొని వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక నాలుగేళ్ల పాలనలో చేకూరిన లబ్ధి, ప్రజలు పొందిన ప్రయోజనాలతో పాటు గత ప్రభుత్వంలో ప్రజలు మోసపోయిన వైనాన్ని, ప్రభుత్వం మోసగించిన విధానాన్ని అర్థం అయ్యేలా వివరించారు. రెండు ప్రభుత్వాలకు మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి అన్నది వివరించడంతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన గొప్పతనం తెలిపారు. అలాగే మెగా పీపుల్ సర్వేలో భాగంగా ప్రజా మద్దతు పుస్తకంలో పొందుపరిచిన ఐదు ప్రశ్నలను ఎంపీ, ఎమ్మెల్యే నేరుగా ప్రజలను అడిగి అవును అని సమాధానం చెప్పిన బుక్‌లో టిక్ మార్క్ పెటిన వారికి రసీదులు అందించారు. ప్రజలు మా భవిష్యత్తు మా పిల్లల భవిష్యత్‌కు జగన్ అన్నతోనే సాధ్యం అని, మా నమ్మకం నువ్వే జగన్ అని వారంతా మద్దతు తెలుపరు. పూర్తి మద్దతుతో ఇంటి డోరుపై, గోడపై జగనన్నే మా భవిష్యత్తు అనే స్టికర్‌ను ఫోన్ పై స్టిక్కరును అతికించి వారితో కలిసి ఫోటో దిగారు. సీఎం జగన్ పాలనపై నమ్మకం ఉంచి భవిష్యత్తులో కూడా మళ్లీ ఆయన పాలనే కావాలని, రావాలని ప్రజలు అంతా విశ్వసించడంతో పాటుగా ప్రభుత్వానికి మద్దతుగా వారి ఫోన్ల ద్వారా మిస్డ్ కాల్స్ ఇచ్చి కుటుంబాలు అన్నే పూర్తి స్థాయి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ తాడ్డి అరుణ శంకర్రావు, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కోఆప్షన్ సభ్యులు, ఏఎంసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: మండలంలోని వివిధ గ్రామాలలో జగనన్నే మా భవిషత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అందులో భాగంగా నారాయణపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిషత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య మాట్లాడుతూ జగనన్నను ఆశీర్వదించి తిరిగి రెండవసారి ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. పథకాలు అందని వారు ఉంటే చెప్పాలని ఇంటింటికీ తిరిగిన సందర్భంలో వారిని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు ప్రజామద్దతు



సీతానగరం: గుమ్మిడివరంలో జగనన్నే మా భవిష్యత్తు పత్రాలను పంపిణీ చేస్తున్న సచివాలయం కన్వీనర్

సీతానగరం: ముఖ్యమంత్రి జగనన్న పాలనపై ఉన్న నమ్మకంతో భవిష్యత్తులో మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని, రావాలని విశ్వసించి ప్రజలు సంపూర్ణమద్దతునిస్తున్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని లచ్చయ్యపేట, లక్ష్మీపురం, మరిపివలస,పెదభోగిలి గ్రామాల్లో సచివాలయాల కన్వీనర్లు గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు 'జగనన్నే మా భవిష్యత్తు,'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు మరిపివలసలో ఎంపీటీసీ బి వరలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు క్రపత్రాలు, స్టిక్కర్లును అంద చేసి జగనన్నకు మద్దతు కోరుతున్నారు. అలాగే లచ్చయ్యపేట పంచాయతీ గుమ్మిడివరంలోను, లక్ష్మీపురంలో ఎంపీటీసీ టి.పార్వతి ఆధ్వర్యంలో గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి జగనన్నకు మద్దతు కూడగట్టారు.

జగనన్నే మా భవిష్యత్..



ఎగువశెంబిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న బీసు, తదితరులు

సాలూరు: పట్టణం, మండలంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తున్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కొటియా గ్రూప్ గ్రామాల్లో బీసు, తదితరులు.. అన్నంరాజువలసలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

పూర్తి స్థాయిలో వైద్యసేవలు

- వైద్యాధికారి శ్రీకాంత్



బాలగుడబలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్

పార్వతీపురంటౌన్: పూర్తి స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి గ్రామంలో వైద్యసేవలందిస్తున్నామని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని బాలగుడబ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో అన్నిరకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో మందులు అందుబాటులోఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్లవద్దనే వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందన్నారు. రోగాల బారినపడి గ్రామాల్లో ఏ ఒక్కరు ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులను నిర్వహిస్తున్నామని, ప్రజలంతా ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

98శాతం హామీల అమలు



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, ఎంపీ గొట్టేటి మాధవి

- ఎమ్మెల్యే జోగారావు, అరకు ఎంపీ మాధవి

పార్వతీపురంటౌన్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98.4% అమలు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, అరకు ఎంపీ గొట్టేటి మాధవిలు అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం 203వ రోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని వెంకంపేట గ్రామంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఇంతవరకు ప్రభుత్వం వారికి చేకూర్చిన లబ్ధిని, సంక్షేమ పథకాలను తెలియపరుస్తూ వారికి ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో విస్తృతంగా పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడుతూ అమ్మ ఒడి, రైతు భరోసా వచ్చిందా, పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా? అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా? అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతోందా? తదితర విషయాలు తెలుసుకునేందుకే తాము వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు ,కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలి



సచివాలయ ఉద్యోగుల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

- ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: మండలంలోని సచివాలయాల ఉద్యోగులు సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన లచ్చయ్యపేట సచివాలయం, ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాలను ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మతో అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున సచివాలయాల్లో ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రతి సోమవారం మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ప్రగతిని, సచివాలయాలను,తాగునీరు సరఫరాపై పరిశీలించి సమీక్షిస్తామన్నారు. అలాగే ఎండలు తీవ్రంగా ఉన్నందుకు విద్యార్థులకు నిర్దేశించిన సమయానికి నిర్వాహకులు మధ్యాహ్న భోజనాలు అంద జేయాలని సూచించారు. పాఠశాలల్లో పౌష్టికాహారాన్ని విద్యార్థులంతా తీసుకోవాలని హితవు పలికారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శి మురళి, సచివాలయ సంక్షేమ, ఇంజినీరింగ్, వ్యవసాయ సహాయకులు వలంటీర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు సమర్థవంతంగా ఎదుర్కోవాలి



ఫైర్ డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురంటౌన్: అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలు కృషి చేయాలని ఎస్ఎఫ్ఓ యు. సుధాకరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం చాకలి బెలగాంలోని ఏకలవ్య పాఠశాలలో అగ్నిమాపక సిబ్బంది వివిధ రకాలైన అగ్ని ప్రమాదాలు సంభవించే వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఫైర్ డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసరాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా వాటిని నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన ఎడల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వాల్‌పోస్టర్‌పై ముద్రించి, డెమోలో పాల్గొన్న వారికి అందజేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ఎల్ఎఫ్ ఎ.రమేష్, ఎల్ఎఫ్ బి.ప్రసాద రావు, ఎల్. మోహన్ కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే



చిలకలపల్లిలో సర్వే చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లిలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేను సోమవారం నిర్వహించారు. బలిజిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చిలకలపల్లిలో సిగ్మా రీసెర్చ్ కన్సల్టెన్సీ నిర్వహించిన సర్వేలో భాగంగా కుటుంబంలో సభ్యులు, సభ్యులకు తగిన ఇంటి విస్తీర్ణం ఉందా? లేదా?, పరిసరాలు తదితర అంశాలను ఇంటింటికీ తిరిగి సేకరించారు. ఈ సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి సమర్పిస్తామని సర్వే బృందం తెలిపింది. ఈ బృందం మూడు రోజులు గ్రామంలో సర్వే నిర్వహించనుంది. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.రవికుమార్, సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, ఆర్గనైజింగ్ సూపర్‌వైజర్ రవికుమార్, ఎంఎల్‌హెచ్‌పి త్రివేణి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మట్టి నమూనాల ఆధారంగా పంటలు

సాలూరు: మట్టి నమూనా ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ మధుసూదనరావు అన్నారు. పట్టణంలోని బంగారమ్మపేట సమీపంలో ఏఓ అనురాధ పండా ఆధ్వర్యంలో మట్టినమూనా సేకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మట్టి నమూనాలు తీయడం వల్ల భూమి స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు. ఈ నేపథ్యంలో భూమికి అవసరమైన మేరకే ఎరువులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి అమరేశ్వరి

వీరఘట్టం: ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని ఆశాఖ డివిజినల్ అధికారి కె.అమరేశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సాగు పద్ధతులు, నూతన వంగడాలను రైతులకు పరిచయం చేయాలని సూచించారు. పంటనష్టం జరిగినట్లయితే వెంటనే నివేదికలు తయారు చేయాలని ఉన్నతాధికారులకు అందించాలన్నారు.

పీఎంఈజీపీ యూనిట్ల మంజూరు వేగవంతం చేయాలి



బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ వై సత్యంనాయుడు, ఐపీఓ రమణమూర్తి

సీతానగరం: పరిశ్రమలు నెలకొల్పడానికి ఉత్సాహం చూపుతున్న ఔత్సాహికులకు వెలుగు ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పీఎంఈజీపీ (ప్రధానమంత్రి ఎంప్లయిమెంట్ గ్యారంటీ స్కీం) పథకంతో రుణాల పంపిణీకి బ్యాంకర్లు చొరవ తీసుకోవాలని పార్వతీపురం మన్యంజిల్లా డీఆర్‌డీఏ ఏపీడీ వై సత్యంనాయుడు, పరిశ్రమల శాఖ ఐపీఓ రమణమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం సీతానగరం మండలంలోని పెదభోగిలి ఎస్‌బిఐ, స్థానిక యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్‌బరోడా, కోఆపరేటివ్ సెంట్రల్‌బ్యాంక్ అధికారులతో పీఎంఈజీపీ రుణాల మంజూరుపై వారు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యుల్లో విద్యావంతులు, వృత్తి పనివారికి పరిశ్రమలు నెలకొల్పడానికి పీఎంఈజీపీ పథకం ద్వారా రుణాలు మంజూరుచేయడానికి అనుమతినిచ్చిందన్నారు. ఈ మేరకు మండలంలోని నిర్దేశించిన బ్యాంకులకు 19 మంది పరిశ్రమలు నెలకొల్పడానికి దరఖాస్తు చేసుకున్నారని తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకర్లు రుణాల విడుదలలో చొరవ తీసుకుని వ్యాపారాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు, సీసీలు కోటేశ్వరరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'ఫ్యామిలీ ఫిజీషియన్'

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంను పకడ్బందీగా అమలు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల వైద్యాధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఏజెన్సీలో మాతాశిశు మరణాలు లేకుండా చూడాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఎనీమియాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పీహెచ్‌సీల్లో డెలివరీల సంఖ్య పెంచేందుకు కృషిచేయాలన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి భవనాలు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన వికాస్ యోజన కార్యక్రమం సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. రెండు జిల్లాల డీఎంహెచ్‌ఓలు జగన్నాథరావు, మీనాక్షి, డీఎంఓలు శ్యామ్, సత్యనారాయణ, ఏపీఓ రోసిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసు

కురుపాం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై చర్యలు తీసకుంటామని ఎస్సై సీహెచ్ ప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. రావాడ కూడలిలో ఉన్న పంట పొలాల్లో మద్యం తాగుతున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేశారు. లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన పలువురిపై అపరాద రుసుం విధించారు.

- **జియ్యమ్మవలస:** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్సై కళాధర్ తెలిపారు. చినమేరంగి, జియ్యమ్మవలస, గరుగుబిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు రోజుల్లో 37 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

వీరఘట్టం: వీరఘట్టం-పాలకొండ రోడ్డులో సోమవారం సాయంత్రం పాలకొండ సీ.ఐ మురళీధర్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. 40 మందికి తనిఖీలు చేయగా వారిలో ఇద్దరు మద్యం తాగి బైక్‌లు నడుపుతున్నట్లు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేశారు. సీఐతో పాటు ఎస్సై కిషోర్‌వర్మ ఉన్నారు.

- **భామిని:** బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై వై.అమ్మాన్‌రావు హెచ్చరించారు. బత్తిలి సమీపంలో బహిరంగంగా మద్యం తాగుతున్న ఐదుగురిపై సోమవారం కేసులు నమోదు చేశారు.

బహిరంగ మద్యపానం నేరం

పాలకొండ రూరల్: బహిరంగ మద్యపానం చట్టరీత్యా నేరమని ఎస్సై బి.శివప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి సిబ్బందితో కలిసి శివారు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం పాలకొండ-విశాఖ, వీరఘట్టం రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేశారు.



వీరఘట్టం: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న సీఐ మురళీధర్, ఎస్సై కిషోర్‌వర్మ